విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



అలకాపూర్ టౌన్‌షిప్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏఈ జ్ఞానేశ్వర్

మణికొండ: మున్సిపాలిటీ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్ అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో లోవోల్టేజీతో ప్రజలు ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారని సంక్షేమ సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన స్పందించి రోడ్డు నంబర్ 29లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి బుధవారం స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మరికొన్ని చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ డీఈ శివశంకర్, ఏడీఈ అంబేద్కర్, ఏఈ జ్ఞానేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, నాయకులు డి. శ్రీనివాస్‌రెడ్డి, బి.శ్రీనివాస్, శంకర్ దేవ్, జార్జ్, శేఖర్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

రాజేంద్రనగర్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుదామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శివరాంపల్లిలోని ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యతన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, ఎంఈవో రాంరెడ్డి, స్కూల్ చైర్మన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పిస్తాం



మణికొండలో శ్మశానవాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

మణికొండ: శ్మశానవాటికలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఈ నెల 10వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'శ్మశానవాటిక రోడ్డు బురదమయం' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా ఆయన స్పందించి మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనికతో కలిసి బుధవారం శ్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండలో ఓసీ, బీసీ శ్మశానవాటిక, పుప్పాలగూడ శ్మశానవాటికలను అభివృద్ధి చేశామన్నారు. అలాగే మణికొండలో దళితుల శ్మశానవాటికకు కూడా రోడ్డు, ప్రహరీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామన్నారు. అయితే శ్మశానవాటికకు వచ్చే రోడ్డు బుల్కాపూర్ నాలా మీదుగా ఉందని కొందరు ఫిర్యాదు చేయడంతో అప్పటి కలెక్టర్ పనులు నిలిపివేయించారన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు లేఖ రాస్తామని రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తే వెంటనే పనులు చేపడతామని తెలిపారు. అలాగే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు అనుమతించాలని కోరతామన్నారు. పర్మిషన్ రాగానే శ్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేశ్, నాయకుడు బి.ముత్యాలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన చోట కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతల రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాస్, ఈఈ రాజు, డీఈలు రమేశ్, దుర్గాప్రసాద్, స్రవంతి, విశాలక్ష్మి, ఏఈలు సునీల్, జగదీష్, ప్రశాంత్, ప్రతాప్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వకుండా చర్యలు ప్రారంభం



రాయదుర్గంలో పాతముంబాయి జాతీయ రహదారి పక్కన మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

రాయదుర్గం: చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వరద నీరు రావడం.. ఇబ్బందులు ఎదురవుతుండడంతో రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో చర్యలు చేపట్టారు అధికారులు. రెండురోజుల క్రితం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ శేరిలింగంపల్లిలో పర్యటించి రోడ్లపైకి వరదనీరు రాకుండా తగిన చర్యలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మ్యాన్‌హోల్స్ క్లియర్ చేసి వ్యర్థాలు, చెత్తాచెదారం లేకుండా వరద నీరంతా సాఫీగా వెళేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచనలపై డీఈ రమేశ్, ఏఈ జగదీష్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది రాయదుర్గంలో లిడ్క్యాప్ నుంచి పాన్‌మక్తా వెళ్లే రహదారి పక్కన ఉండే మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. యుద్ధ ప్రాతిపదికన అన్ని ప్రాంతాల్లో చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

హిందీ భాషీయుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వం హిందీ భాషీయుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ నలుమూలలా దాదాపు 50 లక్షల మంది ఉన్న హిందీ భాషీయులు ఉన్నారన్నారు. వారంతా ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి హిందీ భాషీయులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. అర్జున్‌కుమార్, జయదీప్ సింగ్, దీపక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..?

- శంషాబాద్–షాబాద్ దారిలో పెరిగిన ట్రాఫిక్
- తరచూ ప్రమాదాలు.. వాహనదారుల ఆందోళన



మండలంలోని కవేలిగూడ చౌరస్తాలో ఇరుకుగా ఉన్న రోడ్డుపై వరద

శంషాబాద్ రూరల్: శంషాబాద్–షాబాద్ రహదారిపై 'ట్రాఫికర్' నెలకొన్నది. రోడ్డు విస్తరణకు ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. రెండు వరుసల రహదారిని నాలుగు లేన్‌లగా విస్తరించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

మలుపులతో అవస్థలు..

రహదారిలో ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. నర్కూడ, కాచారం, రాయన్నగూడ, కవేలిగూడ పరిధిలో ఉన్న మలుపుల వద్ద వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో కాచారం శివారులో ఎంటేరువాగుపై ఉన్న కల్వర్టు సైతం చాలా ఏళ్ల కిందట నిర్మించారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా మారి యాక్సిడెంట్లు జరుగుతున్నాయి.

పారిశ్రామికవాడ ఏర్పాటుతో ..

షాబాద్ మండలంలోని హైతాబాద్ వద్ద ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడతో వాహనాల రద్దీ పెరిగింది. భారీ వాహనాలతో పాటు ఇతర వెహికిల్స్ వెళ్తుంటాయి. దీనికితోడు కాచారం వద్ద ఉన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు ఉదయం, సాయంత్ర వేళల్లో ఒకేసారి వరుసగా వెళ్తుంటాయి. దీంతో బస్సులను ఓవర్‌టేక్ చేసే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వరదతో ఇక్కట్లు..

రహదారిపై వరద నిలిచి మరింతగా ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. కవేలిగూడ చౌరస్తా వద్ద చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వరదనీటికి అడ్డుగా రహదారిపై ఇరువైపులా భారీ భవనాలు నిర్మించారు. నిర్మాణాలకు అనుమతులు లేనప్పటికీ వరద కాలువలను కబ్జా చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును విస్తరించాలి..

శంషాబాద్–షాబాద్ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును విస్తరించాలని ఎన్నో ఏళ్లుగా విన్నవించినా ఫలితం మాత్రం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– మొయినుద్దీన్, కేబీ.దొడ్డి, శంషాబాద్

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల మోడల్ స్కూలు, జూనియర్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీటీ కెమిస్ట్రీ పీజీటీ, మ్యాథ్స్ పీజీటీ, తెలుగు పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అవర్లీ బేస్డ్‌పై ఒక పీరియడ్‌కు రూ.182 చొప్పున వంద పీరియడ్లకు రూ.18 200 గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీహెచ్, ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఏ తెలుగుతో పాటు బీఎడ్ అర్హత ఉండాలని, ఆసక్తి గల వారు జూన్ 15వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్కూల్ బస్సుల తనిఖీ

రాజేంద్రనగర్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డెయిరీ ఫాం చౌరస్తా వద్ద బుధవారం స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. రవాణా శాఖ అధికారిని ఉపాసిని ఆధ్వర్యంలో ఫిట్‌నెస్, బీమా, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ కిట్ లేని వాటిని గుర్తించి 17 బస్సులను సీజ్ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

శంషాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ కోరారు. ఈ మేరకు కార్మికులతో కలిసి మండల విద్యాధికారి కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులో జాప్యంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అందజేసిన వారిలో కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు గణేశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారి

మణికొండ: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నార్సింగి రెవెన్యూలోని సర్వేనంబర్ 336లో ఉన్న ప్రభుత్వ భూమి పూర్తిగా చెరువులో ఉందన్నారు. అందులో ఐదు గుంటల భూమి వరకు మాత్రమే బయట ఉందని దాన్ని పరిక్షించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం బోర్డు ఏర్పాటు చేశామన్నారు. వాటిని ఎవరైనా ఆక్రమిస్తే కూల్చివేతలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్: నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ చాకలి మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాధికారి కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు, యునిఫాంల విక్రయాలను అడ్డుకోవాలన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తుండడంతో పాటు అనుమతి లేకున్నా పై తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలన్నారు. అందజేసిన వారిలో ప్రదీప్, అఖిల్, చరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల కరపత్రం ఆవిష్కరణ



గోల్కొండ: గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లు భారీ ఎత్తున జరుగుతున్నాయని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆయన అమ్మవార్ల ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోనాల ఏర్పాట్లు భారీ ఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే ఆలయం, ఆలయ పరిసరాలతో పాటు మెట్ల వరకు సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి అయిందని అన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకులు ఎస్.రాజువస్తాద్, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబా పాల్గొన్నారు.



నార్సింగి ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



నార్సింగి ఎస్సీ బస్తీ ప్రాథమిక పాఠశాలలో..

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మణికొండలో వైస్ చైర్మన్, ఫ్లోర్‌లీడర్లు..

మణికొండ: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, బాగా చదువుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగాపూర్ణశ్రీనివాస్, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, నోటుబుక్కలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆట స్థలాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మాంగ్యానాయక్, నాయకులు రవికాంత్‌రెడ్డి, నార్సింగిలో కౌన్సిలర్లు పత్తి ప్రవీణ్‌కుమార్, జి.శివారెడ్డి, ప్రవళిక కిరణ్, ఉషారాణి, పత్తి శ్రీకాంత్‌రావు, కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్ యాదవ్, నాయకులు రాము, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుడా పాఠశాలలో..

పట్టణంలోని హుడాకాలనీ ప్రాథమిక పాఠశాలలో యూనిఫాంలతో పాటు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ ఉపాధ్యాయులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో..

శంషాబాద్: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ స్థానిక కౌన్సిలర్ రేఖతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





హుడా ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మల్లేశ్, ఉపాధ్యాయులు.. జడ్పీ బాలికల పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



కౌన్సిల్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

డబ్బులివ్వకుంటే డెత్ సర్టిఫికెట్ ఇవ్వరా..?

- కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆగ్రహం
- మున్సిపాలిటీ అవినీతిలో కూరుకుపోయిందని ఆందోళన

శంషాబాద్: 'డెత్ సర్టిఫికెట్ కోసం మున్సిపాలిటీ గడప తొక్కితే డబ్బులిచ్చే దాకా సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. సచ్చినోళ్ల సర్టిఫికెట్ల మీద కూడా డబ్బులు దండుకుంటున్న అధికారులు ఆ మొత్తాన్ని ఎవరెవరికీ పంచుతున్నారు' అని కాంగ్రెస్ కౌన్సిలర్లు తీవ్ర ఆరోపణలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసాగా సాగింది. పట్టణంలో భారీఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆధారాలతో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాతంరాయి రామచంద్రజీ గుడి స్థలంలో త్రిలోక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ బహుళ అంతస్తుల నిర్మాణం, సుమధుర కంపెనీ ఫిరంగి నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల కళ్లకు కనిపించడం లేదా అని మండిపడ్డారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు అధికారులు రూ 5 వేలు ఇస్తేనే డెత్ సర్టిఫికెట్ ఇస్తున్నారని, ఆ అవినీతి సొమ్ములో కీలక ప్రజాప్రతినిధులకు వాటాలిస్తున్నారా..? అంటు ప్రశ్నించారు.

మీడియాకు ఎందుకు రానివ్వరు..

నాలుగున్నరేళ్లుగా కౌన్సిల్ సమావేశాలకు మీడియాకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని కౌన్సిలర్లు సంజయ్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చర్చించే కౌన్సిల్ సమావేశం వివరాలు ప్రజలకు తెలియకుండా దాయడంలో అంతర్యమేముందని నిలదీశారు. అవినీతి వ్యవహారాలు బయటపడతాయనే బీఆర్‌ఎస్ కీలక నేతలు మీడియాను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే సమావేశాలకు మీడియాను తప్పనిసరిగా అనుమతించాలని డిమాండ్ చేశారు. అలాగే కేవలం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ల వార్డుల్లోనే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తమకు అనుకూలమైన కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతూ తీవ్ర వివక్షతను చూపుతున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు బండి భాగ్యలక్ష్మి, అమృత, స్రవంతి, మస్రజా ఆరోపించారు. ఇప్పటికైనా అవినీతిలో కూరుకుపోయిన శంషాబాద్ మున్సిపాలిటీపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వారు డిమాండ్ చేశారు.

రెడ్డి ఫౌండేషన్ ఆర్థిక సాయం



రెడ్డి ఫౌండేషన్ తరపున చెక్కును అందజేస్తున్న నాయకులు

మణికొండ: నిరుపేద విద్యార్థుల చదువుకు మణికొండ రెడ్డి ఫౌండేషన్ వారు అండగా నిలిచారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన వేమూరి తిరుమల్‌రెడ్డి దంపతులు ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. దీంతో వారి పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ.50 వేలను తిరుమల్‌రెడ్డి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్తుల్లోనూ అనేక మంది పేదలు ఉన్నారని వారిని అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ నాయకులు శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని జాతీయ అధ్యక్షుడు, దళిత సేవారత్న రాజు ఉస్తాద్ నివాసంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పచ్చ శ్రీను, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేము వందనం, జాతీయ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డి.రమేశ్, కార్యదర్శి జగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. అనంతరం రాజు ఉస్తాద్‌కు సన్మానించారు.

శాంటామారియా విద్యార్థుల సత్తా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కేంబ్రిడ్జి ఎగ్జామినేషన్స్‌లో సత్తా చాటారు. ఐజీసీఎస్‌ఈ (ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) పరీక్షలకు 88 మంది హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ హేమ బుధవారం తెలిపారు. 67 శాతం విద్యార్థులు ఐసీఈ విశిష్ట అవార్డులు, 33 శాతం విద్యార్థులు ఐసీఈ మెరిట్ అవార్డులు సాధించినట్లు వివరించారు. తమ విద్యార్థులు సాధించిన విజయాలు వారి పట్టుదల, సంకల్పానికి నిదర్శనమని కొనియాడారు.

'మనూ' పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిని సయ్యద్ సారా సుల్తానాకు బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. 'మనూ'లోని విమెన్ స్టడీస్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ పర్యవేక్షణలో 'మహిళా ప్రధాన కుటుంబాల సమస్యలు (హైదరాబాద్ నగరంలో ముస్లిం మహిళల సూచనతో స్త్రీవాద విశ్లేషణ' అనే అంశంపై సారా సుల్తానా థీసిస్‌ను సమర్పించారు.

ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి మేలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో ఈజీ గో ఈవీ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూంను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రవికుమార్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, బొబ్బ నవతారెడ్డి, మారం వెంకట్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.